# నానీ కెరటాలు

హర్షవర్ధన్

తేజ పబ్లికేషన్స్

**Naani Kerataalu**
(Nani Poetry)
By
**Harshavardhan**

© Writer

First Edition :
April 2017

Drawings :
**Kurella Srinivas**
Hyderabad.
✆ 98495 43728

Book & Cover Design :
**Brahmam Bhavana Grafix**
Hyderabad.
✆ 98482 54745

Printed at :
**Karshak Art Printers,**
Hyderabad.

For Copies :
Harshavardhan,
#203, Chamundi Apts,
Sundernagar, P1-24
Hyderabad-500038
Cell : 9949992880
harsha2880@gmail.com

e-book :
www.kinige.com

Price :
₹ 50/-



నా జీవన సాఫల్యానికి కారకులైన
అమ్మానాన్నలు
వంగల సత్యవతి, శ్రీరామమూర్తి గార్లకు...
గురువులకు వినమ్రంగా...

# హర్షవర్ధనాలు

కొన్ని సంఘటనలు పైకి యాదృచ్ఛికంగా కనిపిస్తాయి గానీ, జరగడానికి ముందే ఏవో అదృష్ట తంతువులు అల్లుకుని ఉంటాయనిపిస్తుంది. అట్లాంటిదే హర్షవర్ధన్ గారితో నా పరిచయం.

ఏడాదిన్నర క్రితం, 2015 మార్చి 20న దాట్ల దేవదానం రాజు తన జన్మదినం రోజు సాహిత్యకారులకు పురస్కార ప్రదానం చేశారు. ఆ సందర్భంగా నాకు, నవ్య సంపాదకుడు, కథారచయిత ఎ.ఎన్. జగన్నాథశర్మకు పురస్కారాలు ప్రకటించారు. యనాంలో సభ. మార్చి 19న కాకినాడ రైల్లో బయలుదేరాం. శర్మగారు కూడా నాతో ఉన్నారు. ఇక కబుర్లకేం కొదవ. రైలు బోగీలో మా ఎదుట ఓ కుటుంబం మా మాటలనే ఆసక్తిగా వింటోంది. ఆ కుటుంబ పెద్ద, మీరు గోపీ గారు కదా అన్నారు. అంతే, ఆయన పేరు హర్షవర్ధన్ అని, వాణిజ్యపన్నులశాఖలో ఉన్నతోద్యోగి అని, కొంతకాలంపాటు ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక శాఖకు డైరక్టర్‌గా పనిచేశారని తెలిసింది. ఆయన నా కవితల్ని ధారాళంగా ఉటంకిస్తున్నారు. సరే ఇక జగన్నాథశర్మ గురించి

తెలియనివారెవరుంటారు. ఎందుకోగానీ, మా మాటలు పోటీ పరీక్షల కోసం చదువుతున్న వాళ్లబ్బాయి (అక్కడే ఉన్నాడు) వ్యక్తిత్వవికాసానికి పనికొస్తాయని ఆయనకి తోచింది. విద్యావ్యవస్థనుంచి వచ్చినవాణ్ణి కాబట్టి, వాళ్లబ్బాయి సాయితేజతో ఒక గంటసేపు విడిగా మాట్లాడాను. వారి సతీమణి ప్రమీలగారికి ఈ యాదృచ్ఛిక ఘటన నచ్చిందనిపించింది. మేము తెల్లారి సామర్లకోటలో దిగి యానాం వెళ్లిపోయాం. ఆ రోజు సాయంత్రమే మా కార్యక్రమం. మేం వేదికపైన ఉన్నప్పుడు హర్షవర్ధన్‌గారు వచ్చి పురస్కార వేడుకలను చూసి వెళ్లిపోయారట. మాకు తెలియదు. అరే, ఇదేమిటి? ఈయన అందరిలాటి వ్యక్తి కాదని అనిపించింది. ఆ తర్వాత కాలంలో హర్షవర్ధన్‌గారు హైదరాబాద్‌నుంచి విశాఖపట్నం ట్రాన్స్‌ఫర్ అయ్యారు. పెనవేసుకుపోయిన మా ఆత్మీయత దినదినాభివృద్ధి చెందింది. వారి పెద్దబ్బాయి పెళ్లి సందర్భంగా నేను, నా శ్రీమతి అరుణ వాళ్లింటికి వెళ్లొచ్చాం. అలా కుటుంబస్నేహమూ సాంద్రమైంది. కొందరు ఎంతకాలం కలుసుకున్నా కనెక్టు కారు. మరికొందరు అచిరకాలంలోనే వారు వీరవుతారు. దీనినే 'జననాంతరసౌహృదాని' అంటాను నేను. వాళ్లబ్బాయికి పోటీ పరీక్షల ఉద్యోగాలనుంచి మనసు మరలింది. న్యాయవాద వృత్తిలో చేరాడు. గతంలో అతన్ని ఎంత తీవ్రంగా ప్రోత్సహించారో అంతే హాయిగా అతడి కొత్త అభిలాషను తల్లిదండ్రులను ఆమోదించారు. సంస్కారమంటే అది.

ఇటీవల (2016 ఆగస్టు 22) చింతకింది శ్రీనివాసరావు రచించిన 'కళింగనానీలు' ఆవిష్కరణ సభకు విశాఖపట్నం వెళ్లాన్నేను. ఆ సభలో హర్షవర్ధన్ ఆత్మీయఅతిథిగా పాల్గొన్నారు. అంతకు ముందే వాళ్లిద్దరూ దగ్గరైనారు.

కళింగనానీల గ్రంథ తేజస్సు హర్షవర్ధన్ హృదయాన్ని వెలిగించి ఉంటుంది. అంతేకాక, నేను ఇరవైయేళ్లక్రితం సృష్టించిన నానీల కవితారూపంపై మక్కువ కలిగి ఉంటుంది. లేదా వారి చిరకాల

సాహిత్యాధ్యయన జ్వాల తొందరపెట్టి ఉంటుంది. ఇంకా ఉద్యోగవశాన వారు తిరిగిన ప్రాంతాలు మా గురించి రాయవూ..! అని వత్తిడి చేసి ఉంటాయి. అలాగే, విశాఖపట్నం సముద్రం వారిలో నిండిపోయి పొంగిపొరలి ఉంటుంది. ఇన్ని ఉత్కట భావావేశాల నడుమ వారి అనుభవాలెన్నో సారాంశాన్ని సమకూర్చుకుని నానీల కెరటాలుగా వెలువడుతున్నాయని నాకనిపిస్తోంది.

ఇక, హర్షవర్ధన్ గారి నానీల విషయానికి వస్తే ఇవి అనుభవజనితాలు, సంవేదనాభరితాలు. కొన్నింటిని చూద్దాం.

అరకు కాఫీకి
అంతర్జాతీయ ఖ్యాతి
అరకు సవరలకు
అంటు వ్యాధులే గతి

అరకు పర్యాటకులకు దాని అందం కావాలి. పాలకులకు కాఫీ ఆదాయం కావాలి. కానీ, అక్కడి గిరిజనుల సంక్షేమం ఎవరికీ పట్టదు. వారి ఆరోగ్యస్థితిగతులు అసలే పట్టవు.

మన్నెంలో
ప్రబలుతున్న అతిసారా
నగరాల్లో రెచ్చిపోతున్న
అతి సారా

నాలుగులైన్లలో జీవన పరిస్థితి అంతా వచ్చేసింది. మనిషి బాహ్యవిజయాలపైనే దృష్టి నిలిపాడు. ఆంతరిక లోకం దివాలా తీసినా ఫరవాలేదు.. అనే వర్తమాన సత్యాన్ని చెప్పే మరో నానీ చూడండి.

అంగారక యానం
సఫలమైంది

అంతర్ముఖయాత్రే
విఫలమైంది

ఇంకొంక నానీ ఇలా ఉంటుంది చూడండి.

వృత్తికళాకారులకు
ఆశ్రయం దొరికింది
ఎక్కడ?
శిల్పారామంలో

చేతి వృత్తులు ఉపాధిని కోల్పోతున్నాయి. కోల్పోతున్నాయా? లేక, ప్రపంచీకరణ కల్లోలంలో విధ్వంసమవుతున్నాయా! పాలకులు దీనికి బాధ్యులు కారా! కారు. వాటికి ఆశ్రయం కల్పిస్తున్నారు కదా. ఎక్కడ? ఇంకెక్కడ. శిల్పారామంలో అనే వ్యంగ్యాన్ని పండిస్తున్నాడు కవి. మరొక నానీ,

జనయుద్ధాలు
ఆగిపోతున్నాయి
ఇక జలయుద్ధాలే
మిగిలాయి

ఇక ముందంతా జలరాజకీయాలు జలయుద్ధాలే అంటున్నాడు కవి. జనయుద్ధాలను కూడా తరచి చూస్తే, వాటివెనుక జలకారణాలే దొరుకుతాయి. నానీల్లో ఏది చెప్పినా కవితాత్మకంగా ఉండాలి. దానికి ఈ నానీ ఒక ఉదాహరణ.

పార్కు దగ్గర
పూలదుకాణం
కొననివారికి
పరిమళం ఉచితం

పూలను అమ్మకుండా ఉండొచ్చు.. పరిమళాన్ని ఆపగలరా.. అనేది అందమైన ధ్వని. ఇలా ఉదహరించవలసి వస్తే, అనేక నానీల గురించి చెప్పాలి. ఇక ఆపేస్తాను.

హర్షవర్ధన్ గారు పదవీవిరమణ చేయబోతున్నారు. పదవీ విరమణ సరేగానీ, పెదవీ విరమణ సాహిత్యపద విరమణ చేయరాదని నా ఆకాంక్ష. వారి జీవితంలో ఇదో మలుపు. బహుశా, ఇది మరో కొత్త చైతన్యానికి పిలుపు. వారికి నా హృదయపూర్వక శుభాకాంక్షలు.

-ఎన్. గోపి

# అనుబంధ గంధం..

చాన్నాళ్ల కిందటి మాట. పత్రికాఫీసులో పడుతూలేస్తున్నంతటి హడావుడిలో ఉండగా  మొబైల్ ఫోన్ మోగింది. తీసి మాట్లాడుదును కదా, అటువైపు నుంచి చల్లని స్నేహపూరితమైన గొంతు పల్లవించింది.

"నేను హర్షవర్ధనండీ. మీరు రాసిన దాలప్పతీర్థం కథ చదివేను. చాలా బాగుంది. కథలసంపుటిగానూ వచ్చిందట. నాకెక్కడ దొరుకుతుందది." అని ఆ కంఠం పలికేసరికి నా హడావుడి మొత్తం ఎగిరిపోయింది. ఏ రచయితకైనా ఇంతకు మించిన ఆనందం ఇంకేముంటుంది. వెనువెంటనే విశాఖపట్నంలోని 'బుక్ సెంటర్' పేరు చెప్పాను. హర్షవర్ధన్ గారికి ధన్యవాదాలూ చెప్పాను. మరో అర్ధగంట గడిచిందో లేదే బుక్‌సెంటర్ ప్రతినిధి ఫోన్ చేశారు.

"ఎవరో పెద్దాయనండీ. హర్షవర్దనట. దుకాణానికి వచ్చేరు. మీ పుస్తకాలు అడుగుతున్నారు. వంద కావాలట." అన్నారు. విస్మయం కలిగింది. ఒకటో రెండో కొంటారనుకుంటే నూరు కొనడం ఏంటి.

అసలీయనెవరు?.. ఇలా ఏవేవో ఆలోచనలు రేగాయి. వంద కథాసంపుటాలు పంపించాను. ఆ రోజునుంచీ హర్షవర్ధన్ గారు నా దాలప్పతీర్థాన్ని ఎందరికో పంచుతూనే ఉన్నారు. ఆ కథ గొప్పతనాన్ని మరెందరికో చెబుతూనే ఉన్నారు. పెళ్లిళ్లకి ఆయనిచ్చే బహుమతులతో పాటు నా కథాసంకలనాన్ని కానుక చేస్తూనే ఉన్నారు. నేనిదంతా తలచుకున్నప్పుడల్లా పులకాంకితమవుతుంటాను. ఇలాంటి అక్షరప్రేమికులు, కథాప్రియులు ఉండబట్టే మావంటి కథకులకు అంతో ఇంతో గౌరవం దక్కుతోందని అనిపిస్తుంటుంది.

అలా మొదలైన మా పరిచయం అనంతర కాలంలో ఊడలు వేసుకుంది. మా స్నేహం మరింతగా వర్ధిల్లడానికేనేమో ఆయన బదిలీపై విశాఖపట్నం వచ్చింది. చూడాలి నా సంతోషం. హర్షవర్ధన్‌గారి సౌజన్య సౌరభంతో విశాఖసముద్రమంతా నాలో చేరి ఉప్పొంగినట్టయింది.

'ఎపుడో రుణమున్నది..
ఈ అనుబంధ గంధం ఏ జన్మది..'

అన్నట్టుగా మారిపోయాం. సరిగ్గా అదే సమయంలో నేను 'కళింగనానీలు' పేరిట నానీల కవితా సంకలనాన్ని ప్రచురించాను. ఆ గ్రంథావిష్కరణకు నా మార్గదర్శి, పితృతుల్యులు ఆచార్య శ్రీ ఎన్. గోపి గారిని పిలుచుకున్నాను. ఆవిష్కర్తగా వారుండే సభకు ప్రియాతిథిగా విచ్చేయమని హర్షవర్ధన్‌గారిని కోరాను. ఆయన ఒక్క క్షణమైనా ఆలోచించకుండా 'విత్‌ప్లెజర్' అంటూ వచ్చారు. కార్యక్రమాన్ని శోభాయమానం చేశారు. సభ సక్సెస్ అయిందని ఆనందపడుతున్న తరుణంలో ఆ మర్నాడే ఆయన నుంచి నాకు మరో ఫోన్. అది మరింత సంబరాన్ని తెచ్చిపెట్టింది.

''శ్రీనివాస్‌గారూ! నేనూ మీలాగ నానీలు రాద్దామని అనుకుంటున్నాను.'' అన్నారు. నా సంతోషానికి అవధుల్లేవు.

"తప్పకుండా రాయండి సార్. విశాఖపట్నంలోనే ఆవిష్కరిద్దాం." చెప్పాను.

"మీరంతా పెద్ద రచయితలు. మాలాంటి వాళ్లం నానీలు పట్టుకుంటే అసలు రాయగలమా." అన్నారాయన. ఈ మాట విన్నవెంటనే నా మనసు వేదనాభరితమైనట్టయింది.

"మీరు రాయలేకపోవడం ఏంటండీ. అసలు రాస్తే మీవంటివారే రాయాలి. మీ అనుభవం ముందు మేమెంత?" అన్నాను. ఈ మాట ఆయననేదో సముదాయించడానికి నేనలేదు. నిజంగానే ఆయన చదివిన చదువు ముందు, ఆయన చూసిన లోకం ముందు, ఆయన చవిచూసిన అనుభవాలముందు మావంటి వారం ఎంత?. ఉద్యోగరీత్యా ఆయన తిరగని ఊరులేదు. తెలుగునేల నాలుగు చెరగులా ఆయన పాదాలు ప్రవహించివచ్చినవే. తెలుగుదేశాన అన్ని మాండలీకాలు ఆయనకు కొట్టిన పిండి. ఇక చదవడం అంటే అలాంటిదిలాంటిది కాదు. ప్రాచీన, ఆధునిక, ఆధునికోత్తర తెలుగుసాహిత్యాన్ని బాగా చదివినవారు. ఆకళింపు చేసుకున్నవారు. అలాంటివారు గనుక కలం కదిలిస్తే అద్భుత రచన కాక ఇంకేం వెలువడుతుంది. ఇందుకు నిలువెత్తు నిదర్శనమే ఇప్పటి ఈ ' నానీ కెరటాలు'. నానీ ప్రక్రియకు వన్నె తెచ్చేవిధంగా కవిత్వాన్ని ఈ పుస్తకంలో చూపించారు.

ఈ నానీల ద్వారా హర్షవర్ధన్‌గారు కవితాలోకంలో సుస్థిరమైన స్థానం సంపాదించుకుని తీరుతారు. ఆయన వ్యక్తిత్వాన్ని గురించి చెప్పుకోవాల్సివస్తే..

"తన ఎద ఎల్ల మెత్తన.
కృత ప్రతిపద్యమంతకంటె మెత్తనయై" అన్నట్టుగా ఉంటుంది.

మృదుభాషి. మెత్తని హృదయం. స్నేహచందనం. చూడగానే

ప్రసన్నమైన తత్వం. అన్నింటికీ మించి రమణమహర్షి మార్గాన నడిచే సత్వం. ఇవన్నీ కలిసి ఆయనను సాటివారికి అతి దగ్గరగా చేస్తాయి. హర్షవర్ధన్‌గారు నాకు స్నేహితుడు అని చెప్పుకోవడాన్ని మహద్భాగ్యంగా భావిస్తున్నాను. ఈ నానీకెరటాలతో ఆయన మరిన్ని కవితాయాత్రలకు శ్రీకారం చుట్టాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ఈ సందర్భంగా ఆయనకు అభినందనలు.

-

-చింతకింది శ్రీనివాసరావు

# మిత్రలాభం

ఆదిశంకరులు వివేక చూడామణిలో చెప్పినట్టు మానవజన్మ, సజ్జనసాంగత్యం, ముముక్షత్వం భగవత్ కృపలేక సిద్ధించవు. ఆచార్య గోపిగారితో, చింతకింది శ్రీనివాసరావుగారితో నా సాంగత్యం అలాంటి ఈశ్వరానుగ్రహమే.

మన పెద్దలు ఎప్పుడూ ఒక మాట చెబుతుంటారు. తరచూ అత్తరు దుకాణానికి వెళుతుండమని. మనం కొన్నా కొనకపోయినా కొంత పరిమళం మనకి అంటుతుందని. నా నానీల నేపథ్యం సరిగ్గా అలాంటిదే. నేను ఏనాడూ కవిత్వం రాయాలని అనుకోలేదు. ఆ ఆలోచనా లేదు.

భగవాన్ రమణమహర్షి అన్నట్టు **"ఎవిరీ థింగ్ ఈజ్ ప్రీ డిటర్మైన్డ్"** నేను ఉద్యోగపర్వం చివరి అంకంలో విశాఖపట్నం రావడం, 'కళింగనానీలు' పుస్తకావిష్కరణకు వెళ్లడం, ఆ తర్వాత నానీలు రాయాలని అనిపించడం యాదృచ్ఛికం అనుకోను. ఇదంతా **"డివైన్ ప్లాన్"**గానే భావిస్తాను. మనషులు కలవడం విడిపోవడం ఏదో ఒకలాగ జరగదు. ఒక్కలాగే జరుగుతుంది. అందుకే కొందరిని కలిసినప్పుడు చిన్నతనంలో తప్పిపోయిన అన్నదమ్ములో ఆత్మబంధువులో అనిపిస్తుంది. కొంతమందితో జీవితకాలం గడిపినా ట్రాఫిక్ జామ్‌లు ఎండాకాలం

ఎండలు మించి సంభాషణ ముందుకి సాగదు. దీన్నిలా ఉంచితే, అసలు నేను రాసే వాటికి ప్రచురణార్హత ఉందో లేదో అనే సందేహం కూడా నాలో గట్టిగానే ఒకానొక వేళ నాటుకోక పోలేదు. అలాంటివేళలోనే చింతకింది శ్రీనివాసరావుగారి ప్రోత్సాహంతో ఇదంతా కార్యరూపం ధరించింది.  పూర్వం నలందా విశ్వవిద్యాలయంలో ప్రవేశం కోరే విద్యార్థులు ముందుగా విశ్వవిద్యాలయ ప్రధాన వాకిలి రక్షకుడు పెట్టే పరీక్షలో నెగ్గాలి. ఆ తరువాతే ఆచార్యులు నిర్వహించే పరీక్షకు కూర్చునే అర్హత లభిస్తుంది. ఆ తరువాతే సీటు దొరికేది. ఒక రకంగా నేటి సివిల్ సర్వీసెస్ నియామకానికి ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూ లాగన్నమాట. ఆ క్రమంలోనే నేను రాసిన నానీలన్నీ, నానీలపై పరిశోధన చేసిన యోగ్యుడైన కథామాంత్రికుడు చింతకింది "గేటు" దాటి ఆచార్య గోపి గారి సమక్షానికి చేరాయి. వారు నా పట్ల గల ఆప్యాయతతో వాటిని సంస్కరించి పంపారు. అలా అర్హత పొందిన తర్వాతనే ఈ పుస్తకం మీ చేతుల్లోకి వచ్చింది.

ఈ మొత్తం తొంభై పైగా నానీలు నెల రోజుల సమయంలో రాసాను. ఈ తరుణంలో గోపిగారు ఫోన్ చేసి నన్నెంతో ప్రోత్సహించారు. ఈ నానీల జననం విశాఖపట్నంలోనే జరిగింది గనుక "నానీ కెరటాలు" అనే అర్థవంతమైన నామకరణమూ చేశారు. ఎంతో ప్రేమతో ముందు మాట నేనే రాస్తాను, పుస్తకావిష్కరణకు కూడా వస్తాను అని వరాలిచ్చారు. భోజరాజును చూస్తే కవిత్వం వెల్లివిరుస్తుందనేది మనందరం విన్న మాట. గోపిగారిని చూస్తే నానీలు వాటికవే రసగంగలా పెల్లుబికి వస్తాయనేది నా విషయంలో నిజమైన మాట.

నేను రాసిన నానీలు జీవితానుభవాలనుంచి, మిత్రుల సంభాషణల నుంచి పుట్టినవే.  ఆత్మానందానికి రాసుకున్నవీ ఉన్నాయి. నా ఉద్యోగ జీవితంలో విశాఖపట్నంలో సుమారు ఆరేళ్లు గడిపాను. అందుకే ఎక్కువగా

విశాఖ జ్ఞాపకాలే ఉంటాయి. వీటిలో కొంత వ్యంగ్యం సైతం ఉన్నా 'కుదిర్తే కప్పుకాఫీ' అన్నట్టుగా కాసేపు సరదాగా నవ్వుకోవడానికేనని మనవి.

చివరగా నా చేత నానీలు పలికించిన పెద్దన్న గోపిగారికి, శ్రమంతా తాను తీసుకున్న తమ్ముడు చింతకింది శ్రీనివాసరావుకి, అలాగే అడగ్గానే నానీలకు అర్థవంతమైన చిత్రాలు గీసిచ్చిన కూరెళ్ల శ్రీనివాస్ గారికి, పెద్దగా పరిచయం లేకపోయినా శ్రమదానం చేసిన కవి, స్నేహశీలి, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్. రఘుగారికి, ముఖపత్రం సహా పుస్తకాన్ని అద్భుతంగా డిజైన్ చేసిన బంగారు బ్రహ్మం (భావనాగ్రాఫిక్స్) గారికి, పుస్తకాన్ని ముద్రించిన కర్షక్ ప్రింటర్స్ వారికి  నమస్సులు.

మీ

హర్షవర్ధన్

# నానీ కెరటాలు

నాటి ఆసుపత్రులు
వెళ్లగానే పల్స్ చూసేవారు
ఇప్పుడు
పర్స్ కళ్లజూస్తున్నారు

✦ ✦ ✦

రోగుల రక్షణ కోసం
ఇంటెన్సివ్ కేర్ యూనిట్
అదే ఇవాళ్టి
ఇన్‌సెంటివ్ కేర్‌యూనిట్



ఇంత పెద్ద హోటల్
నడవటం లేదా
కార్పొరేట్ ఆసుపత్రిగా
మార్చి చూడరాదా!

✦ ✦ ✦

ఒకప్పుడు తిరుపతి కొండపై
అన్నీ గుండ్లే
ఇప్పుడక్కడా
దువ్వెన బండ్లే



యాపిల్, బ్లాక్ బెర్రీ
ఒకప్పుడు పండ్లు
ఇవాళవి గ్యాడ్జెట్స్‌తో
నిండిన ఇండ్లు

✦ ✦ ✦

అభ్యుదయవాదికి
లేదు కులం పట్టింపు
సబ్ క్యాస్ట్ మాత్రం
ఎంతో ఇంపు



శివరాత్రినాడు
లింగానికి పాలాభిషేకాలు
ఆకలి శిశువుకు
శోకాలు

✦ ✦ ✦

లవ్‌మ్యారేజ్
తల్లిదండ్రుల ఆనందం
కనీసం
అమ్మాయిని చేసుకుంటున్నాడు



రాజకీయాల్లోనూ
కన్సొలేషన్ బహుమతులు
గవర్నర్, ఛైర్మన్
అవే బాపతులు

✦ ✦ ✦

అడుగంటిన నీటికి
ఇంకుడు గుంతలు
దిగజారిన విలువలకేమో
కొత్తగంతలు



వర్షాలొచ్చేవి
గతకాలం
తుపానులొస్తేనే
నేడు వర్షాకాలం

✦ ✦ ✦

పెళ్లికిముందు
ఒకరంటే ఒకరికి పిచ్చి
ఇప్పుడు
ఎవరికో ఒకరికే..!



క్లీన్ అండ్ గ్రీన్
చెట్లన్నీ పీకెయ్యి
ఫ్లెక్సీల వరుసలు
పచ్చగానే ఉన్నాయి

✦ ✦ ✦

గౌతముని బోధ
మధ్యేమార్గం
ప్రభుత్వాల తీరు
'మద్య' మార్గం



మంత్రంతోనే మోక్షం
గురువు మాట
శివయ్య ఇచ్చాడే
తిన్నడికి ముక్తి బాట

✦ ✦ ✦

గనులు, అడవులు
జాతీయ సంపద
మరి పెరుగుతుంది
నేతల సంపద!



జైళ్లేల?
రామరాజ్యం వచ్చింది
ఎవడి 'సెల్'లో వాడే
బందీకావడం నచ్చింది

✦ ✦ ✦

రాళ్లేం ఖర్మ
అరిగించుకుంటాడు
ఇనుపగనులైనా
హాయిగా తింటాడు



విశాఖలో రియల్ బూమ్
భూకబ్జాల్
నేనేం తక్కువని
సముద్రుడూ తెగబడ్డాడు

✦ ✦ ✦

మీ అబ్బాయి పెళ్లికి
పిలవాలి మమ్మల్ని
ఓ తప్పకుండా
నాకు తెలిస్తే!



అక్షరం మా ఆయుధం
అంటున్న పత్రికలు
ఎటొచ్చి ప్రజలే
నిరాయుధులు

✦ ✦ ✦

పనిచేసే ప్రభుత్వానికే
ఓటెయ్యండి
మనకేమీ
పనుండదు



పేదరిక నిర్మూలన
సదస్సుకొస్తారా
ఎక్కడ?
స్టార్ హొటల్లో

✦ ✦ ✦

నగరాలన్నీ
ప్లాస్టిక్‌తో నిండాయి
చివరకు నవ్వులు కూడా
ప్లాస్టిక్కువే



జాతకాలు చూసే
పెళ్లిళ్లు చేశారు
మరి విడాకులు
ఆకుల్లా రాలుతున్నాయే!

✦ ✦ ✦

కలబంద అంటే
మొరటు అనిపించె
అలోవీరయై
అన్నింటా అవతరించె



మైకుల్లో
ఏమిటిండీ గోల
శబ్దకాలుష్యాన్ని
అరికడుతున్నారు

✦ ✦ ✦

గ్లోబలైజేషన్
టెక్నాలజీకేనా
కులాలకు కూడా
నాటా, తానా, ఆటా, బాటాల్తో



ఇకపై
అన్నీ ఇన్‌స్టెంటే
ఆఖరుకు
మోక్షమైనా, విడాకులైనా సరే!

✦ ✦ ✦

రాళ్లు వెనకేసుకో
అని సలహా ఇస్తే
కిడ్నీలో రాళ్లతో
ప్రత్యక్షమయ్యాడు



జ్ఞానికి జ్ఞానోదయం
జన్మకు ఒక్కసారే
నేతలకు
పార్టీ ఫిరాయించేటప్పుడే

✦ ✦ ✦

ఒలెంపిక్ రజతానికి
ధనకనక వర్షం
ఎవరెస్టెక్కిన
పూర్ణకేదీ హర్షం!



అన్ని గుళ్లకీ
బంగారు పూతలే
శ్రీశైల జంగమయ్యనీ
వదల్లా..!

✦ ✦ ✦

రేపు
జైళ్లలోనే ఆసుపత్రులు
అరెస్టు నేతలకు
ముందస్తు ఏర్పాట్లు



అరకు కాఫీకి
అంతర్జాతీయ ఖ్యాతి
అరకు సవరలకు
అంటువ్యాధులే గతి

✦ ✦ ✦

నాడు గ్రామాల్లో
వరద బీభత్సం
నేటి నగరాల్లో
మురుగుబీభత్సం



బాబాలకు
హెయిర్ డైయింగ్
తలలు నలుపులైన
తలపులు తెలుపులా!

✦ ✦ ✦

అమరావతి
ఆనాడు స్వర్గంలో
ఈనాడు
చంద్రుని ఇంటర్ నెట్‌లో



అరకులోయలో
అమాయకపు సవరలు
నిఖార్సైన
బంగారు సవర్లు

✦ ✦ ✦

సమాచార విప్లవం
మరిన్ని న్యూస్ ఛానల్స్
భరిస్తున్నాం న్యూస్ తక్కువై
న్యూసెన్స్ ఎక్కువై!



మన్యంలో
ప్రబలుతున్న అతిసారా
నగరాల్లో రెచ్చిపోతున్న
అతి'సారా'

✦ ✦ ✦

భూమికి కూడా
కడుపు మండుతుంది
బ్లోఔట్ అంటే
అదే మరి!



అంగారక యానం
సఫలమైంది
అంతర్ముఖయాత్రే
విఫలమైంది

✦ ✦ ✦

పెట్రో పెంపు
ప్రజలకు మంట
ప్రభుత్వాలకు
ఆదాయం పంట



ఉపకులపతులా
ఇదేం తమాషా
నియామకాలన్నీ
అదే దామాషా

✦ ✦ ✦

పార్కులో పొదలు
పూస్తున్నాయి
పువ్వులు కాదు
ప్రేమికుల ముద్దులు



నారుపోసినోడు
నీరు పోయడా
బారుకు తీసికెళ్లినోడు
బీరన్నా పోయడా

✦ ✦ ✦

అబ్బో! ఆరులైన్ల
రహదారులు
మృత్యునగరానికి
రన్‌వేలు సారులూ!



వృత్తి కళాకారులకు
ఆశ్రమం దొరికింది
ఎక్కడ?
శిల్పారామంలో

✦ ✦ ✦

ఒలెంపిక్స్ రజతానికి
బంగారం
పారా ఒలెంపిక్స్‌కేమో
కాకి బంగారం



హృదయాన్ని తాకే
ఉత్తరాలేవీ?
వేళ్లతో తాకే
గుడ్‌మార్నింగులు తప్ప!

✦ ✦ ✦

పొద్దున్నే లేస్తే★
దేవుడికి ఓ దండం
లేవకపోతే
నీకే అందరి దండాలు



★ తమ్ముడు శ్రీను స్ఫూర్తితో

ముఖమంతా
అలా వుందేమిటి?
ఓ అదా!
కవుల గోష్టికి వెళ్లొచ్చాడులే

✦ ✦ ✦

ఐదు నక్షత్రాల హెూటల్స్
అందమే అందం
భోజనం తప్ప
అన్నీ అద్భుతం



అతిథులకు
పెళ్లి ఆల్బమ్‌లు
లంచ్‌కు ముందు
ఎపిటైజర్లు

✦ ✦ ✦

మా ఊరిలో
మద్యనిషేధం అమలైంది
షాపుల్లేవు
అన్నీ బెల్టులే!



ఒకటికి ఒకటి
ఉచితం
ప్రతి బైపాసుకు
ఒక ఏంజియోగ్రాం

✦ ✦ ✦

ఓల్డ్ ఏజ్ హోంలో
తల్లిదండ్రులు
పోతే కాశీలోనే
కర్మకాండలు



వాకిట్లోకి
ప్లాస్టిక్ ముగ్గులొచ్చాయి
పెదవులపై
కార్పొరేట్ నవ్వుల్లాగ

✦ ✦ ✦

జుట్టుపెరగాలని
కేశవర్ధని వాడాడు
ఊడిపోయి
బోడిగుండయ్యింది



మీ పెద్దోడు
అమెరికా వెళ్లాడా!
మరి చిన్నోడు ఇంకా
ఇక్కడే ఉన్నాడేం

✦ ✦ ✦

పార్కు దగ్గర
పూల దుకాణం
కొననివారికి
పరిమళం ఉచితం



జనయుద్ధాలు
ఆగిపోతున్నాయి
ఇక జలయుద్ధాలే
మిగిలాయి

✦ ✦ ✦

ప్యానెల్ డిష్కషన్లు
చేస్తున్నారు పెద్దలు
ఎక్కడ?
పార్క్ బెంచీల మీద



బల్లపై అలంకారం
భగవద్గీత.
ఆచరణవద్దా
ఇదేమి గ్రహచారం

✦ ✦ ✦

నేతలే ఇప్పుడు
హరిదాసులు
పిట్టకథల్లో
మహాఘనులు



కులపెద్దకు
యాక్సిడెంటు
కులపోళ్ల రక్తమే
ఎక్కించాలట

✦ ✦ ✦

ఫేస్‌బుక్‌లో ఉన్నారు
అనుక్షణం..
బైటి ఫేసులు చూసి
చాలా కాలమైంది



ముల్లుపోయి కత్తివచ్చె
ఢాం ఢాం!
పొలంపోయి
"సెజ్జు"లొచ్చే ఢాం! ఢాం! ఢాం!!

✦ ✦ ✦

వస్తుసేవా పన్ను★
కేంద్రానికి దన్ను
రాష్ట్రాలకు
ఒకే తన్ను




★ *వస్తుసేవాపన్నుతో రాష్ట్ర ప్రభుత్వాల అస్తిత్వం ప్రశ్నార్థకం*

గేటెడ్ కమ్యూనిటీ
పూర్తి భద్రత
లోపలి వాళ్లకా?
బయటి వాళ్లకా?

✦ ✦ ✦

గోపాలుని నోట
పధ్నాలుగు లోకాలు
గోవుల నోట
పాలిథిన్ గోతాలు



మా దర్శకుని చిత్రం
వినూత్న ప్రయోగం
పాపం ప్రేక్షకులే
ఎలుకలు

✦ ✦ ✦

కాశ్మీరం
కాలిపోతున్నది
హిమఖండాలు కూడా
వేడెక్కాయి



నేతలు
కళ్లుమూసుకున్నారా
ప్రజల ఇక్కట్లు
చూడలేక మాత్రం కాదు

✦ ✦ ✦

వసుధైక కుటుంబం
అంటే తెలుసా!
పిల్లలు
దేశాలు పట్టిపోయారు



మన కన్నీ
దిగుమతులే
వేలంటేన్స్, మదర్స్‌డేలు
పాశ్చాత్య సంస్కృతులే

✦ ✦ ✦

అశ్వమేధమంటే
యజ్ఞం అనుకున్నా
రేసుకోర్సుకు
తీసుకొచ్చాడు



వంటలన్నీ
ఆడవాళ్ల చలవే
పేటెంట్సు మాత్రం
నలభీములకి

✦ ✦ ✦

పార్కులో
గాలికి ఊగే
బాదం చెట్టు
బాల్యంలోకి నెట్టు



బజారులో బండిపై
తేగలు
పాతరేసిన జ్ఞాపకాల్ని
తిరిగి తేగలవు

✦ ✦ ✦

నిజమైన మిత్రులు
కరవయ్యారు
ఫేస్‌బుక్ దోస్తులు
బరువయ్యారు



తిరుమలలో
పూలన్నీ స్వామికే
జడలు పోయాయిగా
అన్ని ఊళ్లలోనూ అంతే

✦ ✦ ✦

అన్నమయ్య పదం
సుబ్బులక్ష్మి స్వరం
తెలుగువారికి
దేవుడిచ్చిన వరం



ఒకప్పుడు
ఆకాశంలో పక్షులు
ఇప్పుడన్నీ
లోహవిహంగాలే

✦ ✦ ✦

సింధు పథకం
బ్యాట్ల పంపిణీ
దోమలపై దాడికి
పనికొస్తుందా



విశాఖ ఉత్సవ్
అమరావతి ఉత్సవ్
పాత తిరనాళ్లకే
కొత్త పేర్లు

✦ ✦ ✦

ఆర్ట్‌సినిమా
స్టార్ హోటల్ మెనూ
దొందూ దొందే
ఎంతకీ అర్థంకావు



భార్యాభర్తలు
తప్పిపోయారు
మెగామాల్స్
వెతుకులాటలో..

✦ ✦ ✦

ప్రభుత్వ పథకాలన్నీ
సంక్షేమాలే
మందూ మాదే
ఆరోగ్యశ్రీ మాదే



ఆఫ్రికాలో
అనకొండ
భాగ్యనగరంలో
'మెట్రో'★ అనుకొండ

✦ ✦ ✦

పొగడ్త, అత్తరు
ఒక్కలాంటివే
పూసుకుంటే ఇంపు
పోసుకుంటే కంపు



★ మెట్రో రైలు స్కైలైన్ చూశాక

వన్యమృగాలకు
అభయారణ్యాలు
మంచి మనుషులకే
అన్ని భయాలు

✦ ✦ ✦

పిల్లలపై
వైరాగ్యంతో
ఆస్తంతా
మనవళ్లకే రాసేశే

పెళ్లికార్డుతో మిత్రుడు
కొందీసి 'అరేంజ్‌డా?'
అబ్బే లేదండీ
లవ్వే!

✦ ✦ ✦

కర్ణునికి శాపాలు
నూరే
నవ్యాంధ్రకు మాత్రం
నూటికి పైగానే